

సోలార్.. ముందడుగు

కేంద్రప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేలా పథకాన్ని ప్రకటించడంతో తపాలా శాఖ ద్వారా ప్రజల నుంచి రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తున్నారు. 10లో



'ఉపాధి'కి ఊతమేది ?

ఉపాధి హామీ పథకం కూలీలకు రెండేళ్ల నుంచి వేసవి భత్యం నిలిపేయగా, పది వారాలుగా వేతనం కూడా అందడం లేదు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 23°

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. చాలాచోట్ల గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రత నమోదవుతుంది.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



పల్లకీసేవలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించగా తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారు, అమ్మవార్లకు పల్లకీ సేవ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం అర్చకులు సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశాక, బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కేయూ ఎస్డీఎల్‌సీఈలో ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఎస్డీఎల్‌సీఈలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఖమ్మం యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ గణితం, బీఎల్ఐసీతో పాటు పీజీలో తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ తదితర 45 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కాగా, ఈ ఏడాది నుంచి సెమిస్టర్ విధానం అమలు చేయనున్నామని తెలిపారు. అభ్యర్థులు అపరాధ రుసుము లేకుండా ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 98492 50633 నంబర్ లేదా కేయూ దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ www.sdlceku.inలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ లిస్ట్

ఖమ్మం వైద్యవిభాగం: వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు స్వీకరించగా, అర్హత కలిగిన అభ్యర్థులతో ప్రొవిజనల్ జాబితా రూపొందించినట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు తెలిపారు. జాబితాను http://khammam.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చన్నారు. ఇందులో అభ్యంతరాలు ఉంటే ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా తమ కార్యాలయంలో 11న సాయంత్రం 5గంటల్లోపు సమర్పించాలని సూచించారు.

లక్కు ఎవరిదో ?!

ఖమ్మం ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో పోటాపోటీ

- మంత్రుల కుటుంబీకులతో పాటు ఇంకొందరి ప్రయత్నాలు
- అధిష్టానం ప్రకటన కోసం శ్రేణుల ఎదురుచూపులు
- ఇప్పటికే మహబూబాబాద్ అభ్యర్థిగా బలరామ్‌నాయక్ పేరు ప్రకటన



సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నుంచి ఖమ్మం టికెట్ ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. పక్కనే ఉన్న మహబూబాబాద్ స్థానం అభ్యర్థిగా బలరామ్ నాయక్‌ను ప్రకటించగా.. ఖమ్మం నుంచి ఎవరిని బరిలోకి దింపుతారోననే చర్చ జోరుగా సాగుతోంది. జిల్లాకు చెందిన మంత్రుల కుటుంబీకుల మధ్య టికెట్ కోసం నువ్వానేనా అన్నట్లుగా పోటీ సాగుతోంది. వీరేకాక మరికొందరు నేతలు కూడా టికెట్ దక్కించుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. టికెట్ ఎవరికి వచ్చినా గెలుపు నల్లేరుపై నడకే అన్న ప్రచారంతో కేంద్ర ఎన్నికల కమిటీ పరిశీలనలో ఎవరెవరి పేర్లు ఉన్నాయోనని ఆశావహులు ఆరా తీస్తున్నారు.

పరిశీలనలో ఎవరెవరో?

టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ పరిశీలనకు ఎవరి పేర్లు వెళ్లాయన్నది బయటకు తెలియడం లేదు. ఖమ్మం టికెట్ కోసం ఎక్కువ మంది పోటీ పడుతుండడంతో కేంద్ర ఎన్నికల కమిటీ పరిశీలిస్తున్న పేర్లపై ఉత్కంఠ నెలకొంది. ప్రతీ పార్లమెంట్ స్థానం నుంచి ముగ్గురి పేర్లు ఎన్నికల కమిటీ పరిశీలించి అభ్యర్థిని ప్రకటిస్తు న్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని ఇల్లెందు, భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాలు మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో ఉండగా.. ఈ స్థానం నుంచి అభ్యర్థిగా తొలి జాబితాలోనే పోరిక బలరాంనాయక్ పేరు ప్రకటించారు. ఖమ్మం స్థానం పెండింగ్‌లో పెట్టడంపై చర్చ హాట్‌టాపిక్‌గా మారింది.

టికెట్ దక్కితే చాలు..

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పొత్తులో భాగంగా కొత్తగూడెం అసెంబ్లీ స్థానంలో సీపీఐ అభ్యర్థి గెలుపొందగా, మిగతా ఆరు స్థానాల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. అన్ని స్థానాల్లో కలిపి కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ కంటే 2.65 లక్షల ఓట్లు ఎక్కువగా సాధించింది. దీంతో పార్లమెంట్ టికెట్ దక్కితే చాలు గెలుపు సునాయాసమేనన్న ధీమా ఆశావహుల్లో వ్యక్తమవుతోంది. పార్టీ అధికారంలో ఉండడం, నియోజకవర్గాల్లో ఓటు బ్యాంకు బలంగా ఉందన్న అంశాలను బేరీజు వేసుకుని టికెట్ దక్కించుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతూ అధిష్టానం ఎవరిని కరుణిస్తోందోనని వేచిచూస్తున్నారు.

జాబితాలో పలువురు..

ఖమ్మం లోక్‌సభ టికెట్ కోసం జిల్లాకు చెందిన మంత్రుల కుటుంబీకులు పోటీ పడుతున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ రేసులో ఉన్నారు. అలాగే ఖమ్మంకు చెందిన వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, పార్టీ నేతలు జెట్టి కుసుమకుమార్, వి.హన్మంతరావు కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఎవరికి వారు ఇప్పటికే అధిష్టానం పెద్దలను పలుమార్లు కలిశారు. సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకుని టికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఆశావహులంతా అధిష్టానం తమకే టికెట్ ఇస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. తొలి జాబితాలో ఖమ్మం స్థానం అభ్యర్థి పేరు ప్రకటిస్తారని ఆశించారు. కానీ రాష్ట్రంలోని నాలుగు స్థానాలకే అభ్యర్థులను ప్రకటించడంతో ఏ అవకాశాన్నీ వదలొద్దనే భావనతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

ఆగ్రోస్ లైసెన్సుల్లో అక్రమాలు

- నిరుద్యోగులకు అప్పగించాలనేది నిబంధన
- అందుకు విరుద్ధంగా ఎరువుల వ్యాపారులకు కేటాయింపు
- జిల్లాలో 15 మంది గుర్తింపు.. నోటీసుల జారీ

ఖమ్మంవ్యవసాయం: ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల లైసెన్సుల జారీలో కొందరు అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారు. అర్హత కలిగిన నిరుద్యోగులకు లైసెన్స్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికే ఎరువుల దుకాణాలు నిర్వహిస్తున్న వారికి కేటాయించారు. జిల్లాలో ఈ వ్యవహారం కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా కొనసాగింది. అయితే, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నిర్వాహకులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఎరువులు, విత్తనాల సరఫరాలో రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. కానీ కొన్ని కేంద్రాల నిర్వాహకులకు చార్జీలు అందుతుండగా, మరికొందరికి రాకపోవడంతో వ్యవహారం బయటపడింది. ఈ అక్రమాలు ప్రభుత్వం దృష్టికి చేరడంతో సమగ్ర చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలతో ఎరువుల వ్యాపారం చేస్తూ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను నిర్వహిస్తున్న వారికి వ్యవసాయ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా...

బీఎస్సీ అగ్రికల్చర్, అగ్రికల్చర్ డిప్లొమా, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ హార్టికల్చర్ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులకు ఆగ్రోస్ రైతు కేంద్రాల లైసెన్సులు ఇవ్వాలి. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే రూ.1.50 నుంచి రూ.3లక్షల వరకు సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుని అనుమతిస్తారు. అనంతరం ఒక్కో మండలంలో మూడు నుంచి నాలుగు కేంద్రాల నిర్వహణకు వ్యవసాయ శాఖ లైసెన్స్ జారీ చేస్తుంది. అనంతరం నిరుద్యోగులకు లబ్ధిజరిగేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఎరువులు, విత్తనాలు సరఫరాలో రవాణా చార్జీలను భరిస్తుంది. దీన్ని అదునుగా తీసుకున్న కొందరు ఎరువుల వ్యాపారులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను చేజిక్కించుకున్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ ఒత్తిళ్లతో పాటు ఇతర అక్రమాలు జరిగినట్లు సమాచారం.

15 మందికి నోటీసులు

జిల్లాలో 41 ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు కొనసాగుతుండగా, ఇందులో 15 కేంద్రాలు ఎరువుల దుకాణాల యజమానులు నిర్వహిస్తున్నట్లు తేలింది. ఇది నిబంధనలకు విరుద్ధం కావడంతో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో తహసీల్దార్లు, ఏఓలు సంయుక్తంగా లైసెన్సులను తనిఖీ చేసి వ్యాపారులే 15 ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు నిర్వహిస్తున్నారని తేల్చారు. ఈ జాబితా ఆధారంగా ఆయా వ్యాపారులకు నోటీసులు జారీ చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. లైసెన్సుల జారీ సమయంలో నిబంధనల ఉల్లంఘన ఎలా జరిగింది.. ఇంతకాలం ఎందుకు పట్టించుకోలేదు, దీని వెనుక ఉన్నదెవరనే చర్చ జరుగుతోంది. ఇంతలోనే రెండు లైసెన్స్‌లు కలిగిన వ్యాపారులు ఒకటి రద్దు చేసుకునేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

నిబంధనల మేరకు వ్యవహరిస్తాం



ప్రైవేట్ వ్యాపారులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించాం. జిల్లాలో 15 మంది ఇలా ఉన్నట్లు తేలడంతో సంబంధిత అధికారుల ద్వారా వారికి నోటీసులు జారీ చేశారు. నిబంధలన ప్రకారం మొత్తం వ్యవహారాన్ని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి

తాగునీటి గండం

పాలేరు నుండి నీటి సరఫరాలో ఏర్పడిన అంతరాయం, మున్నేరులో నీటి లభ్యత లేకపోవడం వెరసి ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే నీటి సమస్య మొదలుకావడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయం వారిని వేధిస్తోంది. కేఎంసీ అధికారులు గంట, రెండు గంటలు మాత్రమే అదీ రోజు విడిచి రోజు నీటిని విడుదల చేస్తున్నారు. ఇవి తాగునీటితో పాటు గృహ అవసరాలకు సరిపోక బిందెలతో రోడ్లపై నల్లాల వద్ద బారులుదీరుతున్నారు. ఇక కొన్ని ప్రాంతాల్లోని ఇళ్లల్లో బోర్లు ఇప్పుడే అడుగంటడం గమనార్హం.

– ఖమ్మంమయూరిసెంటర్

- జిల్లా కేంద్రంలో ప్రజల పాట్లు
- కేఎంసీ నుంచి అరకొరగానే సరఫరా
- నల్లాల వద్ద బిందెలతో మహిళల బారులు
- మున్నేరు, మినీ లకారం నింపితేనే సమస్యకు పరిష్కారం

చాలీచాలకుండా విడుదల

మున్నేరు పూర్తిగా అడుగంటడం, పాలేరు నుండి నీరు అందకపోవడంతో నగరంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కొద్దోగొప్ప ఉన్న నీటిని రోజు విడిచి రోజు గంట, రెండు గంటలే సరఫరా చేస్తుండడంతో ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. కొన్ని ప్రాంతాలకైతే గంట పాటు కూడా నీరు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో నీటి అవసరాలు పెరగగా, నగర వాసులు రోడ్డెక్కుతున్నారు. అక్కడక్కడా 24 గంటల వచ్చే నల్లాల వద్ద బిందెలతో క్యూ కడుతున్నారు. ఖమ్మంలోని బుర్హాన్‌పురం, సరితా క్లినిక్ నుండి బస్‌డిపో రోడ్డుకు వెళ్లే దారిలో ఎండలోనూ మహిళలు నీటి కోసం వేచి ఉండడం కనిపించింది.

చేతి పంపు, బోర్లపై దృష్టి

నీటి కొరత నేపథ్యాన జిల్లా కేంద్రంలోని చేతి పంపులు, బోర్లపై అధికారులు దృష్టి సారించారు. ఎక్కడెక్కడ చేతి పంపులు, బోర్లు ఉన్నాయో గుర్తించి పనితీరును పరిశీలిస్తున్నారు. నీటి సమస్య తీవ్రం కాకుండా నీటి వనరులన్నింటినీ సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక రూపొందించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లు వేయించి మోటార్లు బిగించడమే కాక కాక డివిజన్లకు షెడ్యూల్ ప్రకారం నీరు సరఫరా చేయాలని నిర్ణయించారు.



ఖమ్మం బస్ డిపో సమీపాన నల్లా వద్ద నీటి కోసం వేచి ఉన్న మహిళలు

పాలేరు నుండి విడుదల చేసినా..

ఖమ్మం నగరంలో నీటి ఎద్దడి కారణంగా పెరుగుతుండడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో అధికారులు శుక్రవారం సాయంత్రం పాలేరు నుండి నీటిని విడుదల చేశారు. మున్నేరు, లకారం మినీ ట్యాంక్‌బండ్‌కు 500 క్యూసెక్కుల మేర నీరు విడుదుల చేయగా, సాగర్ నుండి ఒక టీఎంసీ నీరైనా పాలేరుకు వదిలితేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందనే భావన వ్యక్తమవుతోంది. లేనిపక్షంలో ఇప్పుడు పాలేరు నుండి విడుదల చేసిన నీరు మరో వారం, పది రోజుల కంటే ఎక్కువ సమయం సరిపోదని, మున్నేరు, మినీ లకారం చెరువులను పూర్తిస్థాయిలో నింపితేనే చుట్టుపక్కల ఇళ్లలోనే భూగర్భజలాలు పెరుగుతాయని చెబుతున్నారు.

అడుగంటుతున్న బోర్లు

నగరంలోని లకారం చెరువులో నీటి మట్టం పడిపోతుండడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇప్పటికే రోటరీనగర్, శ్రీనగర్ ప్రాంతాలతో పాటు ఇంకొన్ని చోట్ల బోర్లు వట్టిపోయాయి. రెండు మూడు గంటలకోసారి పది నిమిషాల పాటు కూడా బోర్లు నడవక గృహావసరాలకు ఇబ్బంది పడుతున్నారు. గత ఐదేళ్లల్లో బోర్లల్లో ఎప్పుడూ ఈ పరిస్థితి రాలేదని, వచ్చే రెండు నెలలు పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

రోజు విడిచి రోజు నీటి సరఫరా

అందుబాటులో ఉన్న నీటిని ప్రజావసరాలకు రోజు విడిచి రోజు విడుదల చేస్తున్నాం. కనీస సమయం నీరు వదిలేలా ప్రణాళిక రూపొందించాం. ఎక్కడా నీరు వృథా కావొద్దనే భావనతో గతంలో మాదిరి విడుదల చేయడంలేదు. ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చర్యలు చేపట్టాం.

– రంజిత్, ఎస్ఈ, కేఎంసీ

సీఎం సభ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

భద్రాచలం: రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం భద్రాచలం పర్యటనకు రానున్న నేపథ్యాన ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. శనివారం భద్రాచలానికి వచ్చిన ఆమె ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్ రాజ్‌తో కలిసి దేవస్థానం, మార్కెట్ యార్డు ప్రదేశాలను పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు నివేదికలతో సిద్ధంగా ఉండాలని, పర్యటన పూర్తయ్యే వరకు ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. సీఎం తన పర్యటనలో శ్రీసీతారామచంద్ర స్వామి దర్శించనుండగా ఏర్పాట్లపై ఈఓ రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఆర్డీఓ దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆనందం !

పీఆర్సీ ప్రకటించిన ప్రభుత్వం

- 2017 నుంచి 21 శాతం ఫిట్‌మెంట్‌తో పే స్కేల్
- 2013 నాటి బకాయిలు సైతం విడుదల
- ఖమ్మం రీజియన్‌లో 2,115 మంది ఉద్యోగులకు లబ్ధి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు తీపి కబురు అందజేసింది. 2017 పే స్కేల్‌ను 21శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2017 పీఆర్సీని గత ప్రభుత్వం 16 శాతంగా ఇచ్చింది. కానీ ఉద్యోగులు ఆ పే స్కేల్‌ను సవరించడమే కాక 2021 ఏడాదికి సంబంధించి సవరణ కోసం విన్నవిస్తూ వచ్చారు. ఇప్పు డు ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతంతో పీఆర్సీ ఇవ్వాలని నిర్ణయించడమే కాక 2017 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించింది.

జూన్ వేతనంతో పెరిగిన పీఆర్సీ.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రకటించిన పీఆర్సీ ఈ ఏడాది జూన్ వేతనం నుంచి అమలవుతుంది. ఇక 2017 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు బకాయిలను ఉద్యోగ విరమణ సమయాన వడ్డీ లేకుండా చెల్లించాలని నిర్ణయించింది. అంతేకాక 2017 ఏప్రిల్ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన, వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఉద్యోగులకు కూడా పెరిగిన పే స్కేల్ వర్తించనుంది.



సత్తుపల్లి డిపోలో స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న ఉద్యోగులు

రీజియన్‌లో 2,115 మందికి లబ్ధి

2013లో నాటి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించగా.. 50 శాతం నగదును అప్పట్లో చెల్లించారు. మిగతాది బాండ్ల రూపంలో అందజేశారు. ఆ బాండ్ల గడువు 2020 వరకే ఉన్నా ఆ తర్వాత కూడా చెల్లించలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం 2017 పే స్కేల్ స్థిరీకరణతోపాటు 2013 పే స్కేల్ బకాయిలను సైతం చెల్లించనున్నట్లు ప్రకటించడం విశేషం. ఈ నిర్ణయంతో ఖమ్మం రీజియన్‌లో సుమారు 2,500 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నట్లు తెలుస్తోంది. ఇక 2017 పే స్కేల్‌కు సంబంధించి 2,115 మందికి లబ్ధి జరగనుంది.

డిపోల్లో ఉద్యోగుల సంబురాలు

సత్తుపల్లి టౌన్/ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వం 2017 పే స్కేల్‌ను 21 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేస్తామని ప్రకటించడమే కాక బకాయిలను చెల్లించాలని నిర్ణయించడంపై ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్లుగా ఎదురుచూస్తున్న పీఆర్సీని ప్రకటించి ప్రభుత్వం తమను ఆదుకుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఖమ్మం, సత్తుపల్లి ఆర్టీసీ డిపోల్లో స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీతో పాటు సాహితి, ఇజ్రాయిల్, విజయ్‌కుమార్, సుబ్బారావు, తిరుపతయ్య, దామోదర్‌రెడ్డి, ప్రభాకర్, పీ.వీ.రావు, బాలస్వామి, ఆర్.వీ.రావు, నాగుల్‌మీరా, సలీంపాషా పాల్గొన్నారు.

ఖమ్మం రీజియన్‌లో డిపోల వారీగా లబ్ధి పొందనున్న ఉద్యోగులు

డిపో	ఉద్యోగుల సంఖ్య
ఖమ్మం	489
భద్రాచలం	394
సత్తుపల్లి	328
మణుగూరు	272
మధిర	243
కొత్తగూడెం	233
ఇల్లెందు	106
రీజియన్ కార్యాలయం	50
మొత్తం	2,115

21 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ



2017 పీఆర్సీకి సంబంధించి 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రభుత్వం ప్రకటించినట్లు సమాచారం అందింది. అంతేకాక 2013 నాటి బకాయిలు విడుదల చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఉద్యోగుల తరపున ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, రవాణా శాఖ మంత్రికి కృతజ్ఞతలు. ఉద్యోగులంతా ప్రభుత్వ నిర్ణయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సీహెచ్.వెంకన్న, ఖమ్మం రీజినల్ మేనేజర్

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశీర్వదించండి



మేనిఫెస్టో విడుదల చేస్తున్న జాడ్సన్, నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేయనున్న తనకు సహకరించాలని దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు బక్క జాడ్సన్ కోరారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మూడు జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. సమావేశంలో కోయిని వెంకన్న, రామనాథం, కేవీ రామారావు, రాము, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



చింతల కిరణ్‌శౌరి

వైరా: వైరాలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చింతల కిరణ్‌శౌరికి డాక్టరేట్ లభించింది. ఖమ్మంకు చెందిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ పర్యవేక్షణలో 'రవీంద్రనాథ్ ఠాగూర్స్ విజన్ ఆఫ్ రెలీజియస్ అండ్ ఎడ్యుకేషన్, ఏ ఫిలాసఫికల్ అనాలసిస్'అంశంపై సమర్పించిన పరిశోధనా పత్రానికి ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా కిరణ్‌ను డాక్టర్ డి.కోటయ్య, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



జ్యోతిర్మయి రూప ఓంకార్

బోనకల్: జాతీయస్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన వీరిని ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు బొంతు శ్రీనివాసరావు, అమిరేశి లింగయ్య తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర బాలుర, బాలికల జట్లలో బోనకల్‌కు చెందిన జ్యోతిర్మయి, కె.రూప, జె.ఓంకార్‌కు స్థానం దక్కగా.. బిహార్ రాష్ట్రం పాట్నాలో ఆదివారం నుంచి జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.


ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్య పోరాటం



అభివాదం చేస్తున్న పౌరసంఘాల బాధ్యులు

ఖమ్మంమామిళ్లగూడెం: ప్రజాస్వామ్య పరిరక్షణకు పౌరసంఘాలు ఐక్యంగా పోరాడాలని డాక్టర్ గోపీనాథ్ కోరారు. ఖమ్మంలో శనివారం ఎండ ఇల్యాస్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కులను పాలకులు తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ గోపీనాథ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ బీవీ రాఘవులు, తిరుమల్‌రావు, జీవన్‌కుమార్, నాగమణి, ప్రధాన కార్యదర్శిగా సాధిక్‌అహ్మద్, కార్యదర్శిగా డాక్టర్ కేవీ కృష్ణారావు, సహాయ కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా అబ్దుల్ ముజీబ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో విజయ్, రమేశ్, కారల్‌మార్క్స్, రాంబాబు, అబ్దుల్ ఘనీ, జైనుల్‌పాషా, అనిల్ కుమార్, బిషప్‌లాసేర్, భద్రునాయక్, సమీ, లక్ష్మీనారాయణ, అబ్దుల్ మాలిక్, అబ్రార్, రెహమాన్, గణేశ్, నాగమణి, సుశీల, హుస్సేన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'లావా' పుస్తకావిష్కరణ



దేవయ్య రచించిన లావా పుస్తకం

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలుకు చెందిన యనగందుల దేవయ్య కవి, రచయితగా రాణిస్తున్నారు. ప్రస్తుతం ఆయన తెలుగు పండిట్‌గా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా, టీపీటీఎఫ్ మాసపత్రిక సంపాదక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆయన రచనలకు అవార్డులు దక్కగా, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సన్మానం అందుకున్నారు. ప్రస్తుతం దేవయ్య 'లావా'పేరిట పుస్తకాన్ని రచించగా, ఖమ్మం ఐఎంఏ హాల్‌లో ఆదివారం జరిగే కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరామ్, దేశపతి శ్రీనివాస్ ఆవిష్కరించనున్నారు.

'ఉపాధి'కి ఊతమేది?

- కూలీలకు ప్రోత్సాహం కరువు
- పని ప్రదేశాల్లో కనిపించని రక్షణ చర్యలు
- రెండేళ్లుగా నిలిచిపోయిన వేసవి భత్యం
- పది వారాలుగా అందని వేతనం
- ఉమ్మడి జిల్లాలో 3.22 లక్షల జాబ్‌కార్డులు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

చుంచుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలకు ప్రోత్సాహం కరువవుతోంది. గ్రామాల్లో వలసల నివారణకు అమల్లోకి తెచ్చిన ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి 100 రోజుల పాటు పని కల్పించాల్సి ఉంటుంది. కానీ పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో కూలీలకు ఆ దిశగా ప్రయోజనం చేకూరడం లేదు. అధిక ఉష్ణోగ్రతల్లో పనిచేస్తున్నందుకు కూలీలకు ఏటా వేసవి భత్యంతో పాటు ఇతర వసతులను కల్పించేవారు. కానీ గత రెండేళ్లుగా వీటి కల్పన ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి వేసవిలో కూలీలకు రక్షణ చర్యలు చేపట్టడంలోనూ అధికారులు విఫలమవుతున్నారు. కూలీలకు నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఇతర వైద్య సదుపాయాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది వడదెబ్బ బారిన పడుతుండగా, కొందరు మృతి చెందిన ఘటనలు సైతం ఉన్నాయి. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు జోరుగా సాగుతాయి. వీటిని సద్వినియోగం చేసుకునేందుకు కూలీలు పోటీ పడతారు. ఈ తరుణంలో ప్రభుత్వం కూలీలను ప్రోత్సహిస్తూ వేసవి కాలంలో అదనపు భత్యం అందజేసేది. వేసవిలో ఐదు నెలల పాటు అదనపు వేతనం చెల్లించేవారు. అయితే ఈ పథకం పర్యవేక్షణ రాష్ట్ర పరిధి నుంచి కేంద్రం పరిధిలోకి వెళ్లడంతో 2022 నుంచి వేసవి భత్యం నిలిపివేశారు. దీంతో వేతనం గిట్టుబాటు కాక పనులకు వచ్చేందుకు కూలీలు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇక ఉపాధి కూలీలకు గత 10 వారాలుగా వేతనాలు కూడా చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

వేసవి భత్యం నిలిపివేతతో డీలా

ఉపాధి హామీ పథకం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడు కూలి ఎక్కువగా వచ్చేది. దీనికి తోడు ఫిబ్రవరి నుంచి జూన్ వరకు వేసవి భత్యం 25 నుంచి 30 శాతం వరకు అదనంగా చెల్లించేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం అదనంగా ఇచ్చేవారు. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన ఆప్షన్ తొలగించింది. దీంతో పాటు రెండు పూటలా పని విధానం, ఆన్‌లైన్ హాజరు నమోదుతో తరచూ కూలీలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పనిదినాలు తక్కువ కావడం, వేసవి అలవెన్సులు పూర్తిగా రద్దు చేయడంతో దెబ్బమీద దెబ్బపడినట్లయ్యింది. కూలీలకు వేసవి భత్యంతో పాటు మజ్జిగ, తాగునీరు, రవాణా, గడ్డపార అలవెన్సులు కూడా ఇవ్వడం లేదు. ఇక పని ప్రదేశంలో కనీస వసతులు లేకపోవడం వల్ల కూడా కూలీలు వెనుకడుగు వేస్తున్నారు. ఉపాధి కూలీలకు గరిష్ఠంగా రూ. 272 చెల్లించాలని కేంద్రం నిర్ణయించగా, ఇప్పుడు రూ.150 చొప్పున కూడా గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు.

పనులకు 54 వేల మంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 మండలాల పరిధిలో 1,070 గ్రామ పంచాయతీల్లో 3.22 లక్షల యాక్టివ్ ఉపాధి జాబ్ కార్డులు ఉండగా, 5.47 లక్షల మంది పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రోజుకు సగటున 54,501 మంది కూలీలు హాజరవుతున్నారు. ఇందులో ఖమ్మం జిల్లా నుంచి 30,480 మంది, భద్రాద్రి జిల్లా నుంచి 24,021 మంది ఉన్నారు. ప్రస్తుతం గ్రామానికి సగటున 49 మంది మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో 34,633 మంది కూలీలు పనులకు వచ్చారు. అందులో ఖమ్మం నుంచి 21,711 మంది, భద్రాద్రి నుంచి 12,922 మంది ఉన్నారు. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య లక్ష మంది వరకు ఉండేది. కాగా, వేసవిలో అదనంగా చెల్లించే భత్యం నిలిపివేయడం, సకాలంలో వేతనాలు అందకపోవడంతో ఈ సీజన్‌లో పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక 2022–23 ఆర్థిక సంవత్సరంలో 1.75 కోట్లు పనిదినాలు ఉండగా, 2023 – 24 సంవత్సరానికి గానూ ఉమ్మడి జిల్లాలో 1.16 కోట్ల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ఎండల్లోనే పని చేయక తప్పడం లేదు



వేసవి సీజన్‌లో ఎండలోనే ఉపాధి పనులు చేయాల్సి వస్తోంది. పని చేసే చోట ఎలాంటి సౌకర్యాలు లేవు. తాగునీరు కూడా మేమే ఇంటి నుంచి తీసుకెళ్తున్నాం. పని సమయంలోఎండ తీవ్రత ఎక్కువైతే కాసేపు చెట్ల నీడన సేద తీరుతున్నాం తప్ప టెంట్లు లేవు. ఇప్పుడిప్పుడే ఎండలు పెరుగుతున్నందున అధికారులు తగిన వసతులు కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి.

– భూక్యా పద్మ, ఉపాధి కూలీ, చుంచుపల్లి తండా

వేసవి భత్యంపై ఆలోచించాలి



ప్రతి ఏడాది వేసవి భత్యాన్ని దృష్టిలో పెట్టుకొని మండుటెండల్లో ఉపాధి పనులకు వచ్చేవాళ్లం. ఆ సీజన్ మొత్తంలో వచ్చే అదనపు భత్యమే మాకు మరింత ఆసరాగా నిలుస్తుండేది. దీన్ని కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా నిలిపివేయడంతో అదనపు ఉపాధి దొరకడం లేదు. డీఆర్‌డీఏ అధికారులు చొరవ తీసుకొని వేసవి భత్యం చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. పది వారాలుగా రావాల్సిన వేతనాలు ఇప్పించాలి.

– బిక్కులాల్, ఉపాధి కూలి, చుంచుపల్లి తండా

గుంటు మల్లన్న గ్రామోత్సవం



గుంటు మల్లన్న స్వామి వారి ఊరేగింపులో భక్తులు

మహాశివరాత్రి సందర్భంగా ఖమ్మంలోని భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి గ్రామోత్సవం(ఊరేగింపు) శనివారం రాత్రి నగరంలోని పురవీధుల్లో వైభవంగా సాగింది. స్వామి వారి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి జరగగా, శనివారం రాత్రి ఊరేగింపును సంప్రదాయంగా నిర్వహించారు. మహిళల కోలాటం, నృత్యాల నడుమ స్వామి, అమ్మ వార్ల ఊరేగింపు జరగగా, పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ చందూరు రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ, ఎర్రం బాలగంగాధరతిలక్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మంలోని సుగ్గలవారి తోట శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వార్ల ఊరేగింపు ఈఓ నర్సింహారావు పర్యవేక్షణలో కొనసాగింది. – ఖమ్మంగాంధీచౌక్

తీర్థాలలో రెండోరోజూ భక్తుల రద్దీ



తీర్థాల జాతరకు వస్తున్న భక్తులు

ఖమ్మంరూరల్: మండలంలోని తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయానికి శనివారం కూడా భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం జాతర ప్రారంభం కాగా, శనివారం దాదాపు 50 వేల వరకు భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేశారు. జాతరకు ఉమ్మడి ఖమ్మంతో పాటు వరంగల్, సూర్యాపేట జిల్లాల నుంచి భక్తులు హాజరై సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అయితే, భక్తులు భారీగా వస్తారని తెలిసినా సంబంధిత శాఖల అధికారులు సరైన ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వచ్చాయి. ప్రధానంగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించడానికి నీటి వసతి కల్పించకపోవడంతో ఇబ్బంది పడ్డారు. మొదటి రోజే సౌకర్యాల లేమి బయటపడగా రెండో రోజు అధికారులు అప్రమత్తమై భక్తులకు ఇబ్బంది ఎదురు కాకుండా పర్యవేక్షించారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని సంగమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆమెను నాయకులు సన్మానించారు.

ఆటో ట్రాలీ ఢీకొని గాయాలు

కామేపల్లి: ఆటోట్రాలీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని తాళ్లగూడెంకు చెందిన బి.నాగరాజు కారేపల్లి క్రాస్‌రోడ్డులోని రైస్ మిల్లులో పని ముగించుకుని శనివారం సాయంత్రం ఇంటికి సైకిల్‌పై వెళ్తున్నాడు. గ్రామ శివార్లలో శ్రీ తిరుపతమ్మతల్లి దేవాలయం వద్ద రోడ్డు దాటుతుండగా ఆటోట్రాలీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన నాగరాజును 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

డిపో నుంచి నిలిచిన మద్యం ఎగుమతి



ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న మద్యం వ్యాపారులు

వైరా: వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వైన్స్, బార్లకు మద్యం రవాణా నిలిచిపోయింది. మద్యం అమ్మకాలపై వ్యాట్ చెల్లించాలని సూచిస్తూ అధికారులు యజమానులకు జరిమానా విధిస్తుండడంతో నిరసనగా వ్యాపారులు మద్యం కొనుగోళ్లు చేయలేదు. ప్రతిరోజు డిపో నుంచి ఉమ్మడి జిల్లాలోని 210 వైన్స్, 50 బార్లు, మూడు క్లబ్‌లకు రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల మద్యం తరలిస్తారు. గురువారం ఒకే రోజే రూ.10.20 కోట్లు మద్యం తీసుకెళ్లగా, శనివారం మాత్రం అధికారుల తీరుపై నిరసనగా వ్యాపారులు మద్యం కొనుగోళ్లు చేయలేదు. అలాగే, మద్యంపై వ్యాట్ తొలగించాలని డిమాండ్ చేస్తూ వైన్స్‌ల నిర్వాహకులు వైరాలోని డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా వైన్స్, బార్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ గుర్రాల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే జీఎస్టీ కట్టలేక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. అయినా అదనంగా ఏడు శాతం వ్యాట్ విధించడంతో నష్టం ఎదురవుతున్నందున రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు గొర్రెపాటి నరేశ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

- 15 మందికి తీవ్ర గాయాలు
- హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళ్తుండగా ప్రమాదం



ఘటనాస్థలం వద్ద బస్సు



ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులు

కూసుమంచి: ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి దాటాక ఓ ప్రైవేటు బస్సు బోల్తా కొట్టగా 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి ఏపీలోని రాజమండ్రికి పూరీ జగన్నాథ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు రాత్రి 11 గంటల సమయాన 31 మంది ప్రయాణికులతో బయలుదేరింది. ఈ బస్సు జాతీయ రహదారిపై వస్తుండగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండా సమీపాన అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఘటనలో 15 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్, కూసుమంచి పోలీసులు అంబులెన్స్‌ల్లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో రమావత్ రవినాయర్, మల్ల దుష్యంత్, కనపర్తి సురేశ్ తదితరులు ఉన్నారు. కాగా, డ్రైవర్ వాసంశెట్టి మురళీకృష్ణ బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కూసుమంచి ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి



జయశంకర్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీరాంనగర్ రోడ్డునెంబర్–13 సమీపాన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రిటైర్డ్ ఉద్యోగి కుక్కను ఢీకొని కింద పడగా గాయాల పాలై మృతి చెందాడు. శ్రీరాంహిల్స్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి భట్టు జయశంకర్(67) షాప్‌నకు వెళ్లి వస్తుండగా రహదారిపై అడ్డుగా వచ్చిన కుక్కను ఢీకొని కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు కుటుంబాలకు రూ.11లక్షల ఆర్థికసాయం



రైతు కుటుంబాలతో ట్రస్ట్ బాధ్యులు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన పలువురు రైతుల కుటుంబాలకు వివేకానంద సేవా సంస్థ ట్రస్ట్ బాధ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వివిధ కారణాలతో 22మంది రైతులు మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.50వేల చొప్పున రూ.11 లక్షల ఆర్థిక సాయాన్ని హైదరాబాద్‌కు చెందిన ట్రస్ట్ బాధ్యులు శనివారం రాత్రి అందజేశారు. వైస్ ఎంపీపీ గుత్తా రవి, నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, గుండ్ల ముత్తయ్య, దొంతు సత్యనారాయణ, వెంకటరెడ్డి, కాలంగివీరబాబు, కోటేరు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో అరెస్ట్

ఖమ్మంక్రైం: ఇసుక అక్రమ రవాణా కేసులో లారీ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి బోయపాటి వాసును ఖమ్మం టూటౌన్ పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుకను లారీలో అక్రమంగా తరలిస్తుండగా బైపాస్ రోడ్డులో టూటౌన్ పోలీసులు గుర్తించారు. వాసుతోపాటు వెంకటేశ్వరరావు కలిసి ఇసుక రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో వీరిద్దరే కాక లారీ డ్రైవర్‌ను కూడా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. కాగా, గతంలోనూ ఇసుక అక్రమ రవాణా విషయంలో బోయపాటి వాసుపై పలు ఆరోపణలు ఉన్నాయని పోలీసుల ద్వారా తెలిసింది.

తొమ్మిది నెలలుగా ఆచూకీ లేని యువకుడు

కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



శ్రీను (ఫైల్)

కారేపల్లి: తొమ్మిది నెలల కిందట కనిపించకుండా పోయిన కుమారుడి ఆచూకీ తెలియక ఏమై పోయాడోనని వృద్ధ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మండలంలోని వెంకిట్యాతండాకు చెందిన వాంకుడోతు కమిలి, రాందాస్ దంపతుల కుమారుడు శ్రీనుకు మహబూబాబాద్ జిల్లా ఉత్తరంతండాకు చెందిన అఖిలతో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. కొన్నాళ్లు వెంకిట్యాతండాలోనే కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగించిన దంపతులు ఉపాధి కోసం 2023 జూన్ 20న హైదరాబాద్ వెళ్తున్నామని చెప్పారు. తొలుత అఖిల తల్లిగారి ఊరైన ఉత్తరంతండాకు వెళ్లగా, అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ శ్రీను ఒక్కడే హైదరాబాద్ బయలుదేరాడు. అప్పటి నుంచి అటు అఖిలకు కానీ ఇటు తల్లిదండ్రులకు ఫోన్ చేయకపోగా ఆయన ఫోన్ పని చేయడం లేదు. ఎక్కడ ఆరా తీసిన ఆచూకీ తెలియకపోవడంతో ఈ ఏడాది జనవరి 27వ తేదీన కారేపల్లి, మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కాగా, శ్రీను కానరాకుండా పోవడంపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆయన తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. ఇక అప్పటి నుంచి వారు పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతుండగా, తమ కుమారుడి ఆచూకీ గుర్తించాలని శనివారం వారు కోరారు.

కాళ్ల బేరం ఓకే

ఎట్టకేలకు బీజేపీతో కుదిరిన చంద్రబాబు పొత్తు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మూడు రోజుల పాటు ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇంటి ముందు పడిగాపులు పడిన అనంతరం ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో టీడీపీ – జనసేన పొత్తు కుదిరింది. ఈ మేరకు శనివారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు , జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల సంపూర్ణ మద్దతు తమకు ఉంటుందని ఆశిస్తున్నట్లు వారు ఆకాంక్షించారు. పొత్తుల వ్యవహారంలో బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు మూడు రోజుల పాటు హస్తినలో మకాం వేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు శనివారం మరోసారి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పొత్తుల అంశంపై అసంపూర్తిగా ఆగిపోయిన అంశాలపై, బీజేపీ డిమాండ్లపై చర్చించారు. రాష్ట్రంలోని 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ, జనసేన పార్టీలకు కలిపి 8 స్థానాలను, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 అసెంబ్లీ సీట్లను కేటాయించేందుకు ముగ్గురి మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని టీడీపీ వర్గాల సమాచారం. కాగా, లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల కేటాయింపునకు సంబంధించిన విధివిధానాలపై చర్చించేందుకు ఒకటి రెండు రోజుల్లో మరోసారి మూడు పార్టీల నాయకులు భేటీ అవుతారని ఆయా పార్టీలు ప్రకటించాయి. కాగా, ఎన్డీఏలో చేరాలన్న టీడీపీ, జనసేనల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు జేపీ నడ్డా తెలిపారు.

చకోర పక్షుల్లా ఎదురుచూపు

చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లకు బీజేపీతో పొత్తు విషయంలో ఎదురుచూపులు తప్పలేదు. వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కొనేందుకు ధైర్యం లేని టీడీపీ.. జనసేనతో పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. అయినా వైఎస్ జగన్‌పై పోటీకి బలం సరిపోదని కొద్ది రోజులుగా బీజేపీ సాయం కోరుతూ వస్తోంది. ఇందులో భాగంగా మూడు రోజుల క్రితం బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకోవాలని ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు గురువారం మొదటి దఫా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. అయితే బీజేపీ, జనసేనలకు కలిపి కేటాయించే సీట్ల విషయంలో జరిగిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. తమ డిమాండ్లకు తగ్గట్లుగా 8 నుంచి 10 లోక్‌సభ స్థానాలను కేటాయించాలని బీజేపీ డిమాండ్ చేసింది. అంతేగాక పార్టీలో అంతర్గతంగా తాము చర్చించుకున్న తర్వాత మరోసారి కలుద్దామని బాబు ద్వయానికి స్పష్టం చేసింది. శుక్రవారం మొత్తం బీజేపీ పెద్దల నుంచి కబురు వస్తుందని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చకోర పక్షుల్లా ఎదురు చూశారు. అయితే శనివారం ఉదయం పొత్తుల వ్యవహారంపై చర్చించేందుకు అమిత్ షా, నడ్డాలను కలవాలని అమిత్ షా కార్యాలయం నుంచి పిలుపు రాగానే ఉదయం 11:10 గంటలకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు షా నివాసానికి చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు జరిగిన చర్చల అనంతరం బాబు ద్వయం అక్కడి నుంచి వెనుదిరిగారు. అనంతరం కలిసి పోటీ చేసే విషయంపై మూడు పార్టీల మధ్య అవగాహన కుదిరిందని సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.

నీతిలేని బాబు.. అనైతిక పొత్తు

రాష్ట్ర ప్రయోజనాల పేరు చెప్పి సొంత వ్యవహారాలను చక్కదిద్దుకోవడంలో నేర్పరి అయిన చంద్రబాబు మరోసారి అదే బాట ఎంచుకుని బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారు. తద్వారా తాను నీతి లేని రాజకీయ నాయకుడినని, తనకు రాజకీయ అవసరాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలతో పని ఉండదని నిరూపించారు. పైకి రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు అని బిల్డప్ ఇచ్చుకుంటున్నా, అవినీతి కేసుల నుంచి తనను రక్షించుకోవడమే లక్ష్యంగా ఆయన బీజేపీ పెద్దల ఎదుట సాగిలపడినట్లు స్పష్టమవుతోంది. మూడు రోజులపాటు ఢిల్లీలోనే తన పార్టనర్ పవన్ కళ్యాణ్‌తో కలిసి మకాం వేసి.. అమిత్ షా కరుణ కోసం పాకులాడటం స్పష్టంగా కనిపించింది. తనను కేసుల నుంచి బయట పడేయాలని, అందుకోసం తాను దేనికైనా సిద్ధమని కాళ్లావేళ్లాపడి పొత్తుకు ఒప్పించారని తెలుస్తోంది. దీంతో టీడీపీ, జనసేనతో కలిసి పోటీ చేయనున్నట్లు బీజేపీ కేంద్ర కార్యాలయం శనివారం సాయంత్రం అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. సీట్ల సర్దుబాటు మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. త్వరలో ఏ సీట్లలో ఎవరు పోటీ చేస్తారో తేలుతుందని బీజేపీ ప్రకటించినా, చంద్రబాబు మాత్రం బీజేపీకి 6 ఎంపీ, 6 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినట్లు ఎల్లో మీడియాకు లీకులిచ్చారు. జనసేన, బీజేపీకి కలిపి 30 ఎమ్మెల్యే, 8 ఎంపీ స్థానాలు కేటాయించినట్లు ఎల్లో మీడియాలో అదేపనిగా ప్రచారం చేయిస్తుండడం గమనార్హం.

పైకి బీజేపీ, జనసేన.. లోపల కాంగ్రెస్‌తో..

గతంలో నోటికొచ్చినట్లు తిట్టిపోసి, విడిపోయిన ఎన్డీఏతో మళ్లీ కలిసి ప్రయాణించేందుకు చంద్రబాబు సిగ్గు విడిచి చేతులు కలపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని మోదీని వ్యక్తిగతంగా దూషించి, ఎన్డీఏ ప్రభుత్వాన్ని అనరాని మాటలు అని.. ఇప్పుడు ఆ విషయాన్నే మరచిపోయినట్లు నటిస్తూ రాజకీయ లబ్ధే పరమావధిగా ఇప్పుడు మళ్లీ పొత్తు కుదుర్చు కున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒకవైపు అధికారికంగా బీజేపీ, జనసేనతో పొత్తు కుదుర్చుకుని.. తెరవెనుక లోపాయికారిగా కాంగ్రెస్‌తోనూ అవగాహనతో ఉన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల.. చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడుతుండడం, ఆమెకు బాబు మద్దతుగా నిలిచి మాట్లాడుతుండడం తెలిసిందే. ఇలా అపవిత్ర పొత్తులు, అవగాహనల ద్వారా తనకంటూ ఒక విధానం, ఒక పద్ధతి లేదనే విషయాన్ని చంద్రబాబు నిస్సిగ్గుగా చాటి చెబుతున్నారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకే..

సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు ఇప్పటికే జనసేనతో బంధాన్ని కొనసాగిస్తున్నారు. జగన్‌కు పోటీ ఇవ్వడానికి అది సరిపోదనే భావనతో కేంద్రంలో బీజేపీ మద్దతు కోసం చాలా కాలంగా ప్రాధేయ పడుతున్నారు. సరికొత్త గిమ్మిక్కులతో ఎట్టకేలకు ఆ కూటమితో జట్టుకట్టారు. మూడు రోజులు అమిత్‌షా ఇంటి వద్దే పడిగాపులు పడి, చివరికి బీజేపీ ఏం చెప్పినా చేసేందుకు సిద్ధపడి ఎన్డీఏలో చేరుతున్నారు. బీజేపీ, జనసేనతో కలిసి నడిస్తేనే ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి కనీస పోటీ అయినా ఇవ్వగలనని మొదటి నుంచి బాబు భావిస్తున్నారు. టీడీపీని బతికించుకోవడంతోపాటు తన కొడుకు రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే బీజేపీతో సయోధ్య తప్పదనే ఆలోచనతోనే సిగ్గు విడిచి ఆ పార్టీతో జట్టు కట్టారని స్పష్టమైంది.

మోదీని తిట్టి.. ఎన్డీఏపై అవిశ్వాసం పెట్టి..

ఇదే చంద్రబాబు 2018లో ఎన్డీఏ నుంచి నిష్క్రమించాక బీజేపీ పెద్దలను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. 2014లో తన ప్రయోజనం కోసం ఎన్డీఏతో కలిసి పోటీ చేశారు. గెలిచాక కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీతో అధికారాన్ని పంచుకున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి రాష్ట్రాన్ని కేంద్రం వద్ద తాకట్టు పెట్టారు. దానిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడం, వైఎస్ జగన్ ప్రత్యేక హోదా కోసం అలుపెరుగని పోరాటం చేయడంతో భయపడి 2018లో యూటర్న్ తీసుకుని ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌తో కలిశారు. ఆ తర్వాత చంద్రబాబు ఎన్డీఏను టార్గెట్ చేసుకుని చేసిన విమర్శలు, ఆరోపణలు అన్నీ ఇన్నీ కావు. ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి నమ్మకద్రోహం చేసిందని, హోదా ఇవ్వకుండా మోసం చేసిందని, ప్రధాని మోడీది విఫల ప్రభుత్వమని, ఆయన దేశాన్ని ముంచేశాడని, దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రకరకాల ఆరోపణలు గుప్పించారు. ప్రధాని మోదీ తనకంటే జూనియర్ అని, అదృష్టం బాగుండి ప్రధాని అయ్యారని, ఆయన వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారంటూ లెక్కలేనన్ని విమర్శలు చేశారు. చివరికి ప్రధానిని ఉగ్రవాది అని కూడా దూషించారు. ఆయన తల్లిని, భార్య పేర్లను ప్రస్తావించి మరీ దిగజారుడు ఆరోపణలకు దిగారు. ప్రధాని రాష్ట్ర పర్యటనకు వస్తే నల్ల చొక్కాలు, నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసనలు తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తిరుపతి పర్యటనకు వస్తే టీడీపీ నేతలతో రాళ్ల దాడి చేయించారు. అంతటితో ఆగకుండా లోక్‌సభలో ఎన్డీఏకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి మోడీని అధికారం నుంచి దించేయాలనేంత వరకూ వెళ్లారు. ధర్మపోరాట దీక్షల పేరుతో నానా హడావుడి చేశారు. కానీ ఆయన వ్యూహాలు, రాజకీయాలు తల్లకిందులై ప్రజలు చంద్రబాబును వదిలించుకున్నారు. చరిత్రలో ఏ రాజకీయ పార్టీకి ఇవ్వనంత ఘోర వైఫల్యాన్ని కట్టబెట్టారు.

కోవర్టుల సాయంతో బీజేపీ చెంతకు

2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయాక కాంగ్రెస్‌ను వదిలేసిన చంద్రబాబు.. వెంటనే నిస్సిగ్గుగా బీజేపీని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఓడిపోయిన మరుసటి రోజు నుంచే బీజేపీ ప్రాపకం కోసం పరితపిస్తూనే ఉన్నారు. కానీ చంద్రబాబు గుంట నక్క రాజకీయాలు గ్రహించిన ప్రధాని మోడీ ఆయన్ను ఇన్నాళ్లూ దరి చేరనీయలేదు. అయినా చంద్రబాబు పట్టు విడవకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇందుకోసం తన బినామీలైన సుజనా చౌదరి, సీఎం రమేష్ వంటి వారిని అధికారం పోగానే బీజేపీలోకి పంపారు. వారు బీజేపీలో ఉంటూనే చంద్రబాబు కోవర్టులుగా పనిచేస్తూ ప్రస్తుతం పొత్తు కుదర్చడంలో కీలక భూమిక పోషించారు. రాష్ట్ర బీజేపీలోని ముఖ్య నాయకులను తన గుప్పిట్లో పెట్టుకుని వారి ద్వారా బీజేపీతో కలిసేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేశారు. మరోవైపు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ద్వారా బీజేపీతో పొత్తు కలిపేలా చేసి ఆయన్ను కూడా తన కోసం పని చేయించుకున్నారు. జనసేన బీజేపీతో పొత్తులో ఉండగానే, తాను జనసేనతో పొత్తు పెట్టుకుని మూడు పార్టీలు కలిసి పని చేయాలనే దిక్కుమాలిన వ్యూహాన్ని అమలు చేశారు. అందులో భాగంగా టీడీపీతో పొత్తు పెట్టుకోవాలని పవన్ కళ్యాణ్ కూడా బీజేపీ పెద్దల కాళ్లావేళ్లా పడ్డారు. ఈ విషయాన్ని ఆయనే ఇటీవల స్వయంగా బయటపెట్టారు. పొత్తు కుదిర్చే క్రమంలో బీజేపీ పెద్దలతో తాను చీవాట్లు తిన్నట్లు కూడా చెప్పారు. దీన్నిబట్టి చంద్రబాబు బీజేపీతో కలిసేందుకు తెర వెనుక ఎందరిని ప్రయోగించారో, ఎన్ని కుయుక్తులు పన్నారో అర్థమవుతోంది. మొత్తంగా చంద్రబాబు కాళ్లబేరానికి రావడంతో బీజేపీ పెద్దలు పొత్తుకు అంగీకరించినట్లు స్పష్టమవుతోంది. రాజకీయ స్వార్థం కోసం చంద్రబాబు రెండవసారి బీజేపీతో కలవడంపై రాష్ట్ర ప్రజలు నివ్వెరపోతున్నారు.

జైత్రయాత్రకు 'సిద్ధం'

నేడు బాపట్ల జిల్లా మేదరమెట్ల వేదికగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల సన్నాహక సభ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడానికి బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడు వద్ద ఆదివారం జరగనున్న 'సిద్ధం' ఆఖరి సభకు సర్వం సిద్ధమైంది. చరిత్రలో నిలిచిపోయేలా పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగసభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అద్దంకి నియోజకవర్గంలో మేదరమెట్ల వద్ద కోల్‌కత–చెన్నై జాతీయ రహదారి పక్కనే వందలాది ఎకరాల సువిశాల మైదానంలో ఈ సభను నిర్వహించడానికి భారీ ఏర్పాట్లుచేశారు. దక్షిణ కోస్తాలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని 44 నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు, నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో కదలిరానున్నారు. వీరిని ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి సీఎం జగన్ ఇప్పటికే భీమిలి, దెందులూరు, రాప్తాడులలో నిర్వహించిన సిద్ధం సభలు ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయిన విషయం తెలిసిందే. రాప్తాడు సభ ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే అతిపెద్ద ప్రజాసభగా నిలిచిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషించారు. మూడు సిద్ధం సభలు గ్రాండ్ సక్సెస్ కావడం.. టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్ మ్యాట్రిజ్ వంటి ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సునామీ సృష్టించడం ఖాయమని తేలడంతో చివరి 'సిద్ధం' సభకు కూడా ఉరిమే ఉత్సాహంతో కార్యకర్తలు, నేతలు, అభిమానులు భారీ ఎత్తున తరలివెళ్లడానికి సంసిద్ధమయ్యారు.

పొత్తుల లెక్కతేలినా నైరాశ్యం..

ఇక టీడీపీ–జనసేన పొత్తుల లెక్క తేలాక రెండు పార్టీలు మొదటిసారిగా ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'జెండా' సభకు జనం మొహం చాటేశారు. 'రా కదలిరా' పేరుతో చంద్రబాబు నిర్వహిస్తున్న సభలకు ప్రజలు తరలిరావడంలేదు. టీడీపీ–జనసేన పొత్తును ఆదిలోనే జనం ఛీకొట్టడం.. వైఎస్సార్‌సీపీ సిద్ధం సభలు గ్రాండ్ సక్సెస్ కావడంతో ఆ రెండు పార్టీల శ్రేణులు నైతికస్థైర్యాన్ని కోల్పోయాయి. అలాగే, టీడీపీ–జనసేన పొత్తు కుదిరాక టైమ్స్‌నౌ–ఈటీజీ సంస్థ నిర్వహించిన సర్వేలోనూ 49% ఓట్లతో వైఎస్సార్‌సీపీ 21–22 లోక్‌సభ స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని.. టీడీపీ–జనసేన కూటమి 45% ఓట్లతో 3–4 లోక్‌సభ స్థానాలకే పరిమితమవుతుందని తేల్చి చెప్పింది. ఇది ఆ 2 పార్టీ శ్రేణులను తీవ్ర షాక్‌కు గురిచేసింది. దీంతో ఎన్నికలకు ముందే శ్రేణులు కకావికలమవుతుండటంతో ఉనికి చాటుకునేందుకు చంద్రబాబు ఢిల్లీలో బీజేపీ పెద్దల కాళ్లా వేళ్లా పడి.. ఆ పార్టీతోనూ పొత్తు ఖరారు చేయించుకున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

మళ్లీ ఎన్డీఏలో చేరాం

- బీజేపీతో పొత్తు కుదిరింది.. సహకరించండి
- టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు
- పలు సమస్యలకు 'పొత్తు' పరిష్కారం : పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: బీజేపీతో పొత్తు కుదిరిందని, రాష్ట్ర ప్రయోజనాల కోసం మళ్లీ ఎన్డీఏలో చేరుతున్నట్లు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. శనివారం ఢిల్లీ నుంచి ఆయన టీడీపీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బీజేపీతో పొత్తు ఖరారైన నేపథ్యంలో కొన్ని సీట్లను వదులుకోక తప్పదన్నారు. పరిస్థితులను అర్థం చేసుకోవాలని నేతలకు సూచించారు. సీట్ల పంపకం చివరి దశకు చేరుకుందని, మరో సమావేశం తర్వాత పూర్తి స్పష్టత వస్తుందని తెలిపారు. పొత్తులో భాగంగా ప్రస్తుతానికి 30 అసెంబ్లీ, 8 పార్లమెంట్ స్థానాలను బీజేపీ, జనసేనలకు ఇస్తున్నట్లు నేతలకు తెలిపారు. టీడీపీ–బీజేపీ–జనసేన మధ్య పొత్తుపై ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు. టీడీపీకి కేంద్రం సహకారం చాలా అవసరమని, పొత్తుకు ఇదే కారణమని చెప్పారు. ఈ నెల 17న టీడీపీ–జనసేన నిర్వహించే ఉమ్మడి భారీ బహిరంగ సభకు ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానించామని తెలిపారు. మూడు పార్టీలు కలిసి ఉమ్మడి సభ నిర్వహిస్తామని చెప్పారు. మోదీ పాల్గొనే అవకాశం ఉందని, ఇందుకు అనువైన ప్రదేశం ఎంపిక చేయాలని నేతలకు సూచించారు. ఈ నెల 17 లేదా 18 తేదీల్లో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇదిలా ఉండగా 'తిరిగి ఎన్‌డీఏలో చేరినందుకు సంతోషిస్తున్నా. పవన్ కళ్యాణ్‌తో కలిసి, ఏపీలో ప్రజల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి, అభివృద్ధిలో కొత్త శకానికి నాంది పలికేందుకు, మోదీతో కలిసి పని చేయడం కోసం ఎదురుచూస్తున్నా' అని ఎక్స్‌లో చంద్రబాబు పోస్ట్ చేశారు. ఇది మూడు పార్టీల మధ్య పొత్తు మాత్రమే కాదని, దేశానికి సేవ చేయడానికి కట్టుబడి ఉన్న ముగ్గురి భాగస్వామ్య మని పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర విభజన కారణంగా రాష్ట్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో పదేళ్లగా కొనసాగుతున్న గందరగోళంతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కారణంగా ఐదేళ్లుగా తలెత్తిన సమస్యలు బీజేపీ, టీడీపీ, జనసేన కలయికతో తీరబోతున్నాయని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తెలిపారు. ఎన్డీయేలో భాగస్వామిని చేసినందుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ధన్యవాదాలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

జిల్లా వార్తలు

కళాశాల భవన నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం



జయశేఖర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన భవన నిర్మాణానికి పూర్వ విద్యార్థి, తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ భారీ విరాళం ప్రకటించారు. కళాశాలను శనివారం పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయగా, తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ నుంచి జయశేఖర్ మరో రూ.50 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు, తాళ్లూరి జయశేఖర్‌కు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడుసుమిల్లి జగదీశ్, చావా లక్ష్మీనారాయణ, అల్లం నాగేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పొదెం వీరయ్య యువసేన ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రాజీవ్‌గాంధీ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. లీగ్ దశలో శనివారం జరిగిన మ్యాచ్‌ల్లో జగదీశ్ లెవెన్ జట్టుపై బీట్ లెవెన్ జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్ మణి లెవెన్, రేగుబల్లి జట్ల మధ్య మ్యాచ్ జరగగా మణి లెవెన్ జట్టు గెలిచింది. ఇంకో మ్యాచ్‌లో సమీర్ లెవెన్ జట్టుపై గోదావరి లెవెన్ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన క్రీడాకారులకు నిర్వాహకులు ట్రోఫీలు అందజేశారు.

సోలార్ విద్యుత్‌కు ముందడుగు

- 300 యూనిట్లలోపు వినియోగానికి ప్లాంట్ల మంజూరు
- నూతన పథకాన్ని తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం
- ప్లాంట్ వ్యయంలో రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు సబ్సిడీ
- త్వరలో విడుదల కానున్న పూర్తి విధివిధానాలు
- పోస్టాఫీసుల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు



ఖమ్మంగాంధీచౌక్: సోలార్ విద్యుత్‌పై ఆసక్తి కనబరిచే వారి కోసం కేంద్ర ప్రభుత్వం నూతన పథకాన్ని తీసుకొచ్చింది. తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఇంటికి 300 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం 'ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ' యోజన పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యాన సబ్సిడీపై సోలార్ ప్లాంట్ల మంజూరుకు సిద్ధమవుతోంది. కాగా, ఈ పథకానికి సంబంధించి పూర్తిస్థాయి విధివిధానాలు వెల్లడి కావాల్సి ఉండగా.. తపాలా శాఖ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

పెరుగుతున్న వినియోగం.. చార్జీల భారం

నానాటికీ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. అయితే, కొన్ని సందర్భాల్లో అవాంతరాలు ఎదురవుతుండడానికి తోడు వినియోగదారులపై చార్జీల భారం పడుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యాన వివిధ వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగేలా కొత్త పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రధానంగా 300 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారి కోసం ఈ పథకాన్ని రూపొందించారు. నెలసరి సగటు విద్యుత్ వినియోగం, ఇంటి పైకప్పు విస్తీర్ణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్లాంట్ల ఏర్పాట్లకు అవకాశం ఇస్తారు. విద్యుత్ వినియోగం ఆధారంగా మూడు రకాల ప్లాంట్లను సబ్సిడీపై మంజూరు చేయాలని నిర్ణయించారు. కాగా, 1–4 కేడబ్ల్యూపీ (కిలోవాట్ 'పీక్') ప్లాంట్ ఏర్పాటుకు రూ.50 వేల నుంచి రూ.1.90 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అయితే, ప్లాంట్ సామర్థ్యం ఆధారంగా ధరలు కంపెనీల వారీగా కాస్త అటూ ఇటు ఉండొచ్చని చెబుతున్నారు. కానీ, కేంద్రం అనుమతించిన కంపెనీల ఆధ్వర్యాన ప్లాంట్లను ఏర్పాటు చేయనుండగా సబ్సిడీ లభిస్తుంది.

తపాలా శాఖ ద్వారా రిజిస్ట్రేషన్లు

సోలార్ విద్యుత్ పథకం ఏర్పాటుకు ఆసక్తి ఉన్నవారు తపాలా శాఖను సంప్రదించాల్సి ఉంటుంది. కరెంటు బిల్లు, సెల్ నంబర్, ఇంటి పైకప్పు ఫొటోతో సమీపంలోని పోస్టాఫీస్‌ను సంప్రదిస్తే ప్రత్యేకంగా కేటాయించిన యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తారు. తద్వారా సోలార్ విద్యుత్‌కు రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఆపై వినియోగదారుని వివరాలు, అర్హతల ఆధారంగా పథకానికి ఎంపిక చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో 3 వేలకు పైగా దరఖాస్తులు

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సోలార్ ఉచిత విద్యుత్ పథకానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 3 వేల మంది తపాలా శాఖ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తపాలా శాఖ ఆసక్తి, అర్హత కలిగిన వారి దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆ పథకానికి పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నెల నుంచే రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తూ తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. అయితే ఈ పథకానికి అర్హత సాధించలేని పలువురు కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న సోలార్ విద్యుత్ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. కాగా, ఒకసారి ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే నిరంతరం విద్యుత్ ఉత్పత్తి జరగడమే కాక బిల్లుల భారం తప్పుతుందనే భావన పలువురి నుంచి వ్యక్తమవుతోంది.

రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం..



కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సోలార్ విద్యుత్ పథకానికి దరఖాస్తులు అందుతున్నాయి. ప్రభుత్వం పేర్కొన్న ప్రత్యేక యాప్‌లో మా ఉద్యోగులు వినియోగదారుల వివరాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఆసక్తి కలిగిన వారు తపాలా ఉద్యోగిని అర్హత పత్రాలతో సంప్రదిస్తే సోలార్ విద్యుత్ పథకానికి రిజిస్ట్రేషన్ చేస్తారు.
–బి.రవికుమార్, సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

సోలార్ విద్యుత్ పథకం సబ్సిడీ వివరాలు

నెలవారీ వినియోగం సగటున యూనిట్లు	సోలార్ ప్లాంట్ సామర్థ్యం	సబ్సిడీ
0 – 150	1–2 కేడబ్ల్యూ	రూ.30 వేల నుంచి రూ.60వేలు
150 – 300	2–3 కేడబ్ల్యూ	రూ.60 వేల నుంచి రూ.78 వేలు
300కు పైన	3 కేడబ్ల్యూ పైన	రూ.78 వేలు



నీలాద్రీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.9.69 లక్షలు

పెనుబల్లి: మండలంలోని భవన్నపాలెం అటవీ ప్రాంతంలోని నీలాద్రీశ్వరాలయానికి మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఈ మేరకు భక్తులు సమర్పించిన కానుకలను శనివారం దేవాదాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు సమక్షాన లెక్కించగా.. రూ.9,69,000 ఆదాయం నమోదైందని ఆలయ ఈఓ పాకాల వెంకటరమణ తెలిపారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు, డైరెక్టర్లు గంగిశెట్టి జగదీష్, మామిళ్ల సత్యనారాయణ, రామిశెట్టి శ్రీనివాస్, మానికల ప్రసాద్, నాయకులు మందపాటి నరసింహారెడ్డి, పసుమర్తి విశ్వనాథ్, అర్చకులు ఉప్పల ఆదిత్యశర్మ, కేతముక్కల పవన్‌కుమార్‌శర్మ, సిబ్బంది శ్రీధర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టు మతోన్మాదులకు గుణపాఠం చెప్పాలి..

- 'మాస్‌లైన్' కేంద్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ఠాగూర్
- పిండిప్రోలులో రాయల, నాగేశ్వరరావు వర్ధంతి సభ



మాట్లాడుతున్న మాస్‌లైన్ జాతీయ కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ఠాగూర్

తిరుమలాయపాలెం: ప్రజాపంథా మార్గంలో ఉద్యమాలు కొనసాగిస్తూ దోపిడీ పాలకవర్గాలు, మతోన్మాద ఫాసిస్టు, కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గాలకు గుణపాఠం చెపాల్సిన అవసరముందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ఠాగూర్ పిలుపునిచ్చారు. ఇదే రాయల సుభాష్‌చంద్రబోస్‌కి ఇచ్చే నివాళి అని తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలులో పార్టీ జాతీయ నాయకుడు రాయల సుభాష్‌చంద్రబోస్, సీనియర్ నాయకుడు రాయల నాగేశ్వరరావు వర్ధంతిని జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సభలో ప్రదీప్‌సింగ్ మాట్లాడుతూ.. రాయల సుభాష్‌చంద్రబోస్ 50 ఏళ్ల పాటు రహస్య జీవితం గడిపి, ప్రజలను చైతన్యవంతం చేయడమే కాక దేశంలో పెరిగిపోతున్న దోపిడీకి వ్యతిరేకంగా విప్లవ పార్టీలన్నీ కలిసి పోరాడాలని కోరుకున్నారని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట విప్లవ పాఠాలు, జాతీయోద్యమ పోరాటాల స్ఫూర్తితో జాతీయస్థాయిలో ఎదిగారని చెప్పారు. ప్రస్తుతం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు మతోన్మాదం పెరిగి ప్రజలపై అమానుష దాడులను కొనసాగిస్తున్న నేపథ్యాన వామపక్ష శక్తులందరూ ఐక్యంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించి స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జాతీయ సహాయ కార్యదర్శి సుభాష్‌దేవ్, కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు కె.రమ, కృష్ణ గొగొయ్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, దొండేటి ఆనందరావు, ఆర్.శివలింగం, బందెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు, పుసులూరి పుల్లయ్య, గోకినేపల్లి సరోజిని, వెంకటస్వామి, ఎడ్లపల్లి నవీన్, ఆరెంపుల వెంకన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు ఏరియాలో సింగరేణి డైరెక్టర్ పర్యటన



షావెల్ పనితీరును పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

మణుగూరు రూరల్ : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో డైరెక్టర్(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు శనివారం పర్యటించారు. ఈసందర్భంగా ఓసీ2, ఓసీ 4 వ్యూ పాయింట్ల నుండి బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత ప్రక్రియను పరిశీలించారు. అలాగే, ఓసీ 2 గనిలో ఓబీ వెలికితీతకు వినియోగిస్తున్న షావెల్ పనితీరుపై ఆరా తీసిన ఆయన భారీ యంత్రాల పూర్తి పనిగంటల సామర్థ్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం మణుగూరు ఓసీలో బొగ్గు ఉత్పత్తిని పరిశీలించి దుమ్ము, ధూళి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్, అధికారులు కే.వీ.రావు, వీసం కృష్ణయ్య, డీవీఎస్.సూర్యనారాయణరాజు, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, రాంబాబు, వీరభద్రుడు, రవీందర్, శ్రీనివాస్, షబ్బీరుద్దీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు



డ్రైవర్‌కు పరీక్ష చేస్తున్న అధికారులు

మణుగూరు రూరల్: మణుగూరు మండలం చిక్కుడుగుంట ప్రాంతంలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్)లో సీఈ బి.బిచ్చన్న పర్యవేక్షణలో శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఇటీవల బీటీపీఎస్ ప్రధాన రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యాన అధికారులు నివారణ చర్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసే లారీలు, టిప్పర్ డ్రైవర్లకు ఎస్‌పీఎఫ్ అధికారి బాబురావు ఆధ్వర్యాన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. అనంతరం మద్యం సేవించి వాహనాల నడపడం వల్ల ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కల్పించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆనంద్‌ప్రసాద్, సత్యనారాయణ, ఎస్‌పీఎఫ్ ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.